క్లుప్తంగా

మద్యం షాపులు దరఖాస్తుకు గడువు పొడిగింపు

సత్తెనపల్లి: గౌడ కులానికి రిజర్వ్ చేసిన మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఈనెల 8 వరకు గడువు పొడిగించిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.విజయ్ కుమార్ బుధవారం తెలిపారు. సత్తెనపల్లి సర్కిల్ పరిధిలో సత్తెనపల్లి మున్సిపాల్టీ, ముప్పాళ్ల, రాజుపాలెం మండలాలకు ఒక్కొక్కటి చొప్పున మూడు మద్యం షాపులు గౌడలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈనెల 8న సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో ఈనెల 10న లాటరీ తీసి షాపుల కేటాయించనున్నట్లు ఆయన వెల్లడించారు.

నేడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం

రాజుపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీవీ సత్యనారాయణ తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

పెన్నా, గోదావరి కాలువ పనుల పరిశీలన



అమరావతి: మండలంలోని వైకుంఠపురం–అమరావతి– లింగాపురం మీదుగా వెళ్తున్న పెన్నా, గోదావరి అనుసంధాన కాలువ పనులను బుధవారం రెవెన్యూ అధికారులతో కలిసి పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే పరిశీలించారు. లింగాపురంలో సంప్ నిర్మాణం, అమరావతి– సత్తెనపల్లి రోడ్డులోనూ ఆయన తనిఖీ చేశారు. కాలువ నిర్మాణం, అది వెళ్లే ప్రాంతాలు, భూసేకరణ విస్తీర్ణం, గతంలో నిర్వహించిన గ్రామసభల గురించి అధికారులు ఆయనకు వివరించారు. కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో కాలువ పనులను జేసీ సమీక్షించారు. ఆయన వెంట సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంత్ రెడ్డి, తహసీల్దార్ డానియేల్, మండల సర్వేయర్ భాగ్యలక్ష్మి, మెగా సంస్థ ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన అవసరం



సత్తెనపల్లి: వర్మీ కంపోస్ట్‌పై తయారీపై డ్వాక్రా మహిళలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి. భాస్కర్‌రెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామలోని ఎస్‌డబ్ల్యూపీడీ షెడ్‌లో గల ట్రైనింగ్ సెంటర్‌లో డ్వాక్రా మహిళలకు తడి, పొడి చెత్త వేరు చేయడం, వర్మీ కంపోస్ట్ తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుని తడి, పొడి చెత్తను వేరుచేసి తద్వారా వర్మీ కంపోస్టు తయారు చేయాలని చెప్పారు. ఎక్కడివో ఫోటోలు పెట్టి తూతూమంత్రంగా చేయవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఐఆర్డీ ఫ్యాకల్టీ డాక్టర్ మోహన్‌రావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరెడ్డి, ఐటీసీ రిసోర్స్ పర్సన్ సీహెచ్. బొలయ్య, పంచాయతీ కార్యదర్శులు కుంభ వెంకటేశ్వర్లు, సీహెచ్. కృష్ణ ప్రసాద్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నాళం మట్టపల్లి జీవితం యువతకు ఆదర్శం



రెంటచింతల:స్వాతంత్ర్య సమరయోధుడు, పల్నాటి గాంధీగా పేరు పొందిన నాళం మట్టపల్లి జీవితం నేటి యువతకు ఆదర్శమని గ్రామ పెద్దలు గొంటు ఆదిరెడ్డి, వాసవీ అమ్మవారి దేవస్థానం అధ్యక్షులు కట్టమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం నాళం మట్టపల్లి వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక రామాలయం సెంటర్లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో నాళం మట్టపల్లి పల్నాడు ప్రాంతంలో చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం ఆరుగురు విద్యార్థులకు ఆర్థిక సహాయం అందచేశారు. ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాళం పెదబాబు, నాళం సత్యనారాయణ, నాళం నరసింహారావు, వైఆర్ఎస్ స్కూల్ కరస్పాండెంట్ యేచూరి వెంకట సైదయ్య, నాళం చిన బాబు, కొక్కెండ్ల బ్రహ్మం, భిక్షాలు, నారాయణపురం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పచ్చదనంపై గొడ్డలి వేటు

- కాల్వ కట్టపై చెట్లు మాయం
- రాత్రికి రాత్రే ట్రక్కుల ద్వారా తరలింపు
- పట్టించుకోని ఎన్నెస్పీ సిబ్బంది



పీబీసీ కాల్వపై మొద్దులతో తరలింపునకు సిద్ధంగా ఉన్న ట్రక్కు

ముప్పాళ్ల: పచ్చ నేతల దోపిడీకి అడ్డూఅదుపు లేకుండా పోయింది. అధికారం ఉందనే అహంభావంతో యథేచ్ఛగా రాత్రి వేళల్లో కాల్వ కట్టపై చెట్లు మాయం చేస్తున్నారు. ఎన్నెస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్నప్పటికీ కూడా అధికారులు ఏమీ తెలియనట్లుగా వ్యవహరిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అక్రమాలకు ఆ శాఖలోని సిబ్బందే సహకరిస్తుండటం విశేషం. వాటాల పంపకంలో తేడా రావటంతో విషయం బయటకు పొక్కింది. మండల కేంద్రమైన ముప్పాళ్లకు అనుకొని ఉన్న పెదనంది పాడు బ్రాంచి కాలువ కట్టపై చెట్లు రాత్రి రాత్రే కనుమరుగవుతున్నాయి. గత నాలుగు రోజుల నుంచి పగలు కట్టపై ఉన్న పెద్ద చెట్లను గుర్తించడం, రాత్రి వేళల్లో ముక్కలు చేసి తెల్లారే సరికి ట్రాక్టర్ల ద్వారా నరసరావుపేట తరలించడం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో అంతా అధికార టీడీపీ శ్రేణులే పాల్గొన్నాయి. ఇప్పటి వరకు నాలుగు ట్రాక్టర్ల వరకు మొద్దులను తరలించి అమ్మకాలు జరిపినట్లు స్థానికులు చెబుతున్నారు. తమకు అధికార పార్టీ నాయకుల అండదండలున్నాయని, తనను ఎవరూ ఏమీ చేయలేరని బాహాటంగానే చెబుతుండటం విశేషం.

ఎన్నెస్పీ సిబ్బంది సహకారం

ముప్పాళ్ల ఎన్నెస్పీలో పనిచేసే సిబ్బంది సహకారంతోనే ఈ తతంగం జరుగుతుండటం విశేషం. ట్రక్కుకి ఇంత చొప్పున మామూలు తీసుకుంటూ గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యవహారాన్ని కొనసాగిస్తున్నారు. ఆ శాఖలోని మరో సిబ్బందికి వాటా అందకపోవడంతో విషయం బయటకు పొక్కింది. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు ఎన్నెస్పీ అధికారులు మరో నాటకానికి తెరదీశారు. కొట్టిన చెట్లకు వేలం నిర్వహిస్తామని చెబుతున్నారు. ఎవరి అనుమతితో కొట్టారో చెప్పడం లేదు. బహిరంగంగానే ప్రభుత్వానికి సంబంధించిన స్థలంలో చెట్లను అనుమతులు లేకుండా నరికి వేసి ట్రాక్టర్ల ద్వారా చెట్లను ముక్కలుగా చేసి తరలించడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఇదే రీతిలో కట్టలపై ఉన్న పెద్ద పెద్ద తుమ్మ చెట్లను ముక్కలుగా చేసి సొమ్ము చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. నీటి పారుదల శాఖపై అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతోనే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వీటితో పాటుగా ఎన్నెస్పీ కార్యాలయంలో ఉండే పాత కలప కూడా మాయం చేశారు. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తి స్థాయిలో విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

అధిక లోడుతో వాహనాలు నడిపితే చర్యలు



వాహనాలను ఆపి హెచ్చరిస్తున్న ఎస్ఐ నాగేంద్రరావు

క్రోసూరు: అధిక లోడుతో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ నాగేంద్రరావు హెచ్చరించారు. క్రోసూరులో బుధవారం అధిక లోడుతో ప్రయాణిస్తున్న వాహనాలను ఆయన ఆపి, డ్రైవర్లను హెచ్చరించారు. మిర్చి కోతలకు కూలీలను తీసుకెళ్లే వాహనాలు, అధిక లోడులతో ఇసుక, మట్టి తరలించే ట్రాక్టర్లు, లారీల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వీటిని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ముందుగా హెచ్చరికలుంటాయని, తరువాత చర్యలుంటాయని హెచ్చరించారు. వాహనదారులు అధిక లోడులతో ప్రయాణాలు చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

అమరావతిలో...

అధిక లోడుతో ప్రయాణించే వాహనదారులపై చర్యలు తప్పవని పిడుగురాళ్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో 36వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆటో డ్రైవర్ల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కచ్చితంగా లైసెన్స్, పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ అచ్చయ్య, ఎస్ఐ అమీర్ పాల్గొన్నారు.

విస్తరణతో రోడ్డున పడతాం

తహసీల్దార్‌కు చిరు వ్యాపారుల వినతి



వినతిపత్రం అందిస్తున్న చిరు వ్యాపారస్తులు

రాజుపాలెం: చిరు వ్యాపారస్తులందరికీ న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ దుర్గేష్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని మాచర్ల–గుంటూరు రోడ్డు విస్తరణలో భాగంగా నష్టపోయే చిరు వ్యాపారస్తులు బుధవారం కార్యాలయంలో వినతిపత్రం అందించారు. రోడ్డు విస్తరణ వల్ల 50మంది దాకా ఆర్థికంగా నష్టపోతామని తెలిపారు. చిన్నచిన్న బంకులు, టీ స్టాల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు తొలగించడం వల్ల తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేసి, ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజుపాలెం సర్పంచ్ పులిబండ్ల అశోక్, చొక్కా మల్లికార్జున, లంకా వీరయ్య, జంగం శ్యాంబాబు, కోటేశ్వరరావు, సూరె శ్రీనివాసరావు, అనసూర్యాబాయి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు హక్కును వినియోగించుకోవాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు.పట్టణంలోని రఘురామ్ నగర్‌లో గల టీడీపీ కార్యాలయంలో ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలపై సత్తెనపల్లి పట్టణ, ముప్పాళ్ల మండల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం ఇప్పటివరకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలలోనే రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని చెప్పారు. ప్రతిభావంతులు, మేధావులంతా జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. పరిశీలకులు వర్క్స్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, తాతా జయప్రకాశ్ నారాయణ,వేములకొండ శ్రీనివాస్ మాట్లాడారు. ముందుగా ఎన్టీఆర్, కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో నాయకులు యెల్లినేడి రామస్వామి, ఆతుకూరి నాగేశ్వరరావు, పూల వెంకటకోటయ్య, కొల్లిపర కాశీవిశ్వనాథం, మక్కపాటి రామచంద్రరావు, సయ్యద్ మహబూబ్ పాల్గొన్నారు.

పాస్టర్ కాటుపల్లి దంపతులకు డాక్టరేట్



దాచేపల్లి : మండలంలోని మాదినపాడు తెలుగు బాప్టిస్ట్ చర్చి పాస్టర్, పల్నాడు బాప్టిస్ట్ ఫీల్డ్ కార్యదర్శి, టీబీసీసీ డైరెక్టర్ కాటుపల్లి డేవిడ్‌రాజ్, రూత్ కుమారి దంపతులకు డాక్టర్‌రేట్ ప్రదానం చేశారు. తెలుగు బాప్టిస్ట్ సంఘాల్లో 25 సంవత్సరాలు పాస్టర్‌గా డేవిడ్ రాజ్ దంపతులు చేసిన సేవలను అమెరికన్ బాప్టిస్ట్ ఫారిన్ మిషన్ సొసైటి(ఎబీఎఫ్ఎంఎస్) గుర్తించింది. రెండు రోజుల క్రితం కందుకూరులోని ఏబీఎం చర్చిలో జరిగిన రామాయపట్నం బాప్టిస్ట్ థియాలాజికల్ 150వ వార్షికోత్సవంలో డేవిడ్‌రాజ్ దంపతులకు డాక్టరేట్‌ని ఎబీఎఫ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు పులుకూరి సుజయ్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. డేవిడ్‌రాజ్ దంపతులను స్థానిక క్రైస్తవ సంఘాల నాయకులు, పాస్టర్లు అభినందించారు.

ఈ- పంట నమోదుకు 15 వరకే గడువు



రైతులకు సూచనలిస్తున్న ఏవో దేవదాసు

నకరికల్లు: రబీలో ఈ- పంట నమోదు, ఫార్మర్ ఈకేవైసీ నమోదు చేసుకునేందుకు ఈనెల 15వ తేదీతో గడువు ముగుస్తుందని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని నకరికల్లు, శివాపురంతండా గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పిలక దశలో ఉల్లికోడు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10కేజీలు, పోరేట్ గుళికలు 5 కేజీలు చొప్పున 20కేజీల ఇసుకలో కలిపి చల్లాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ సుభాని, వై.ప్రభాకర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

దమ్మాలపాడు(ముప్పాళ్ల): మండలంలోని దమ్మాలపాడులో బుధవారం వ్యవసాయాధికారి ఎం.అరుణ ఆధ్వర్యంలో రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న సాగులో యాజమాన్య పద్ధతులపై ఆయన అవగాహన కల్పించారు. ఎరువుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేసిన రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ల భార్యలకు కౌన్సెలింగ్



తాంబూలం అందిస్తున్న సూపర్‌వైజర్ ఫాతిమా రోశమ్మ, డీఎం కుమార్

సత్తెనపల్లి: ఆర్టీసీ డ్రైవర్లు ప్రశాంతంగా విధులకు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత వారి భార్యలదేనని సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ డే సందర్భంగా బుధవారం ఆర్టీసీ డ్రైవర్ల భార్యలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు విధులకు వెళ్లేటప్పుడు, ఇంటి దగ్గర ఉన్న సమయంలో కుటుంబ సభ్యులు వారి ఆహార నియమాలు, విశ్రాంతి సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీసీ డ్రైవర్ల ఉద్యోగ బాధ్యతలు ఎంతో ముఖ్యమని, ఎంతో మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత వారి భుజస్కంధాలపై ఉంటుందని తెలిపారు. మానసిక, ఆర్థిక పరమైన ఒత్తిళ్లు విధినిర్వహణలో ఉండకూడదని సూచించారు. అనంతరం ఆర్టీసీ డ్రైవర్ల భార్యలకు ట్రాఫిక్ సూపర్‌వైజర్ ఫాతిమా రోశమ్మ జాకెట్టు ముక్కలు, గాజులు, తాంబూలం ఇచ్చి సత్కరించారు.

ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు ఎదగాలి



పిడుగురాళ్ల: ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ బీవీ కృష్ణారెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఫేరవెల్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ముందుగా బాగా చదివిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఆటలపోటీల విజేతలకు బహుతులు ఇచ్చారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి

అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు



జెండాను ఆవిష్కరిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

గురజాల : చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక లక్ష్మీటాకీస్ సెంటర్‌లో కామ్రేడ్ నూతులపాటి ఫణి ఐదో వర్ధంతి సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలోని దేవదాయ, ధర్మాదాయ శాఖ భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలన్నారు. ఇల్లు లేని పేదలకు ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేయాలన్నారు. రైతాంగానికి గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని హామీ ఇచ్చి వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయాలనే ఆలోచనతో ఉన్నారన్నారు. వెంటనే నరేంద్రమోదీ స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులను ఆదుకోవాలన్నారు. ముందుగా న్యూ డెమోక్రసీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి ఎస్. విష్ణు పాల్గొన్నారు.

దొంగలున్నారు జాగ్రత్త !

- పోలీసుల మైక్ ప్రచారం
- మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు హెచ్చరికలు



ఎస్ఐ నాగేంద్రరావు

క్రోసూరు: మండలంలోని గ్రామాల్లో అక్కడక్కడా దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నాగేంద్రరావు గ్రామాల్లో మైకు ద్వారా ప్రచారం చేయిస్తున్నారు. ప్రజలు ఇళ్లు వదిలి వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఆభరణాలు, నగదు పెట్టకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎక్కువ రోజులు ఊర్లకు వెళ్లేవారు పోలీసులకు తెలియపరచాలని, ఆ సమయంలో ఆ ఇంటిపై నిఘా ఉంచుతామని తెలిపారు. కూలీ పనులకు వెళ్లే వారు కూడా ఇళ్లల్లో విలువైన వస్తువులు ఉంచరాదని చెప్పారు. దొంగలు మారు వేషాల్లో పరిచయస్తులుగా గానీ, కొత్తకొత్త ఎత్తుగడలతో దొంగతనాలు చేస్తున్నారని వివరించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వ్యాపారస్థులు కూడా కెమెరాలు పెట్టుకోవడం ద్వారా నేరాలను జరిగే తీరును గుర్తించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి



పిడుగురాళ్ల: సమాజంలో బాల్య వివాహాలు జరగకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని హ్యూమన్ రైట్స్ పౌండేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తానూరి కృష్ణకుమారి చెప్పారు. పట్టణంలోని రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కృష్ణకుమారి మాట్లాడుతూ..బాల్య వివాహాలను అరికట్టే దశలో ఎదురయ్యే సమస్యలను స్థానిక పోలీస్, రెవెన్యూ, ఐసీడీఎస్, ఆరోగ్య శాఖ సిబ్బందికి తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ నూర్జహాన్, ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు షేక్ కరీముల్లాతోపాటు హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు, పాఠశాల ప్రిన్సిపల్ వనజ, ఏఎన్ఎం ఉషా పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో

గురజాల రూరల్ : రైతులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ఎం.సంధ్యారాణి సూచించారు. గురజాల నగర పంచాయతి పరిధిలోని సచివాలయం 1, 2 పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో వివిధ పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు తీసుకుని మంచి దిగుబడి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారులకు ఊడిగం చేసేలా బడ్జెట్



రెంటపాళ్లలో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

సత్తెనపల్లి: కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులు, సంపన్నులు, పెట్టుబడిదారులకు ఊడిగం చేసే విధంగా ఉందని కౌలు రైతు సంఘం సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపుల్లో వ్యవసాయ రంగానికి బీజేపీ తీవ్ర అన్యాయం చేసిందంటూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో బుధవారం బడ్జెట్ పత్రాలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ బడ్జెట్‌లో పేదలకు, రైతులకు, అసంఘటిత రంగ కార్మికులకు, విద్యా, వైద్య రంగాలకు తీవ్రమైన నష్టం జరిగిందని ఆరోపించారు. విద్యకు, వైద్యానికి, సంక్షేమానికి రాయితీలను తగ్గించి బడా కార్పొరేట్లకు రాయితీలను ఇచ్చిందని విమర్శించారు. ఈ బడ్జెట్‌ను అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి మక్కపాటి నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జమండ్లమూడి భగత్, మహిళా సంఘం నాయకులు దుగ్గి మేరమ్మ, కేవీపీఎస్ నాయకులు బొల్లెపల్లి రామారావు, విద్యార్థి సంఘం సత్తెనపల్లి మండల కార్యదర్శి అమూల్య, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు దుగ్గి నాగేశ్వరరావు, అనూష, మల్లీశ్వరి, అనిల్, రవి, పెద్దబ్బాయి పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

క్రోసూరు: కేంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కి అన్యాయం జరిగిందని పలు ప్రజా సంఘాల నేతలు తెలిపారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద బుధవారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ దేశ జనాభాలో 70 నుంచి 80 శాతంగా ఉన్న రైతులు, వ్యవసాయ కార్మికులకు ,నిరుద్యోగులకు బడ్జెట్‌తో నిరుత్సాహమే మిగిలిందని తెలిపారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు టి. హనుమంతరావు, రైతు సంఘం జిల్లా నాయకులు రావెళ్ల వెంకటేశ్వర్లు, వ్యవసా కార్మిక సంఘం జిల్లా నాయకులు వేపూరి వెంకటేశ్వర్లు, భవనిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు చిలక యేసయ్య, గన్నపూడి మహేష్, అచ్చంపేట వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కత్తులు గోపి కృష్ణారెడ్డి, దుద్దల ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

పాఠశాలలో వసతుల కల్పనకు ఎస్‌బీఐ కృషి



బెంచీలను అందజేస్తున్న ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్లు

పిడుగురాళ్ల: పాఠశాల అభివృద్ధి కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా ఎస్‌బీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని బీఆర్‌జీసీ ఎంపీపీఎస్ పాఠశాలకు రూ.5 లక్షల విలువ గల వస్తువులను అందజేస్తున్నామని పిడుగురాళ్ల ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ బి.దేవీంద్రనాథ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో బెంచీలు, కంప్యూటర్లు, ప్రింటర్, మరుగుదొడ్ల మరమ్మతులతోపాటు విద్యార్థులకు మంచినీటి సౌకర్యం కల్పించేందుకు ఆర్ఓ ప్లాంట్ సమకూర్చినట్టు వివరించారు. కార్యక్రమంలో నర్సరావుపేట ఆర్‌బీఓ చీఫ్ మేనేజర్ కేఎస్ఆర్ బాలాజీ, బీఆర్ఓ మేనేజర్ ఎం గోపయ్య, పాఠశాల హెచ్ఎం వెంకట సుబ్బమ్మ, నాయకులు రామకృష్ణ, ఎం.కొండలు, ఎస్ఎంసీ చైర్మన్ రాము, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు

మాచవరం: మండలంలోని మోర్జంపాడులో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. పూజా కార్యక్రమాలు, గ్రామ వీధుల్లో స్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, భజనలు, మొక్కుబడులు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం స్వామి కల్యాణోత్సవం, రైతు సేవా సంఘం ఆధ్వర్యంలో మహాన్నదానం నిర్వహిసున్నట్లు వెల్లడించారు.

8 నుంచి 11 వరకు ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

స్వామి కల్యాణోత్సవం సందర్భంగా 8వ తేదీ నుంచి 11 వరకు జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజాల బండ లాగుడు బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 8న జత పళ్ల విభాగం, 9న పాల పళ్లు, నాలుగు పళ్ల విభాగం, 10న సేద్యపు విభాగం, జూనియర్ సైజు, 11న సీనియర్ సైజు, (జాక్‌పాట్) పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.